www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 157 | హైదరాబాద్ | సోమవారం | 25-08-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## భారత రాష్ట్ర సమితి ఇప్పటికే మూడు ముక్కలైంది



హైదరాబాద్ ఆగస్టు 23 (సిద్దిపేట పవర్):

కులం, మతం లేనిదే భాజపా నేతలు రాజకీయం చేయలేరని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ దొంగ ఓట్లతో గెలిచినట్లు అనుమానంగా ఉందని వ్యాఖ్యానించారు. కరీనంగర్ జిల్లా చొప్పదండిలో నియోజకవర్గంలో కొనసాగుతున్న కాంగ్రెస్ రెండోదశ జనహిత పాదయాత్రలో ఆయన మాట్లాడారు.

"బీసీల గురించి బండి సంజయ్ ఒక్క మాట కూడా మాట్లాడరు. భాజపా రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి ఆయన్ను తొలగించినపుడు మేం మాట్లాడాం. బీసీ బిల్లుకు ఇకనైనా భాజపా నేతలు మద్దతివ్వాలి. వచ్చే ఎన్నికల నాటికి రాజకీయ ముఖచిత్రంలో భారత రాష్ట్ర సమితి ఉండదు. ఆ పార్టీ ఇప్పటికే మూడు ముక్కలైంది. ఓట్ల చోరీతోనే మోదీ మూడో సారి అధికారంలోకి వచ్చారు" అని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు.

# దేవుడు డిజైనర్, ప్రకృతి గురువు

### మనం మంచి స్టూడెంటా కాదా అనేది ప్రశ్న

తెలంగాణ రైజింగ్ 2047..
ట్రిలియన్ డాలర్ ఆర్థిక లక్ష్యం
లైఫ్ సైన్సెస్, మెడ్‌టెక్
రంగాల్లో హైదరాబాద్ ముందంజ
స్టార్టప్‌లు, MSMEలకు తెలంగాణ
ప్రభుత్వ ప్రోత్సాహం సీఎం రేవంత్





హైదరాబాద్ ఆగస్టు 24 (సిద్దిపేట పవర్):

హైదరాబాద్‌లో జరిగిన బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య ప్రసంగం చేశారు. జీవవిజ్ఞానం, వైద్య రంగం, ఆవిష్కరణల ప్రాధాన్యం గురించి ఆయన విశ్లేషిస్తూ తెలంగాణను ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. "దేవుడు ఒక మంచి డిజైనర్, ప్రకృతి మంచి గురువు. మనం మంచి విద్యార్థులమా కాదా అనేది ప్రశ్న," అని సీఎం రేవంత్ అన్నారు. జీవశాస్త్రం, వైద్య రంగంలో ప్రకృతినే మనకు ఉత్తమ గురువుగా తీసుకోవాలని, మనం చేసే పరిశోధనల్లో తప్పులు



రాహుల్ గాంధీ 'ఓట్ల చోరీ' ఆరోపణలకు రాజ్ థాకరే మద్దతు!

ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కయ్యాయని రాహుల్ విమర్శ
ఈ అంశాన్ని తాను 2016-17లోనే లేవనెత్తానని చెప్పిన థాకరే
ఎన్నికలను బహిష్కరించాలన్న తన సూచనను ప్రతిపక్షాలు పట్టించుకోలేదని వ్యాఖ్య
ఓటర్ల జాబితాలపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపు

## కేసీఆర్‌కు మళ్లీ అస్వస్థత..

పర్యవేక్షిస్తున్న ప్రత్యేక వైద్యులు
షుగర్, సోడియం స్థాయుల్లో హెచ్చుతగ్గులు
హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందంతో చికిత్స
ఫాంహౌస్‌కు చేరుకున్న కేటీఆర్, హరీశ్ రావు ఇతర నేతలు
అవసరమైతే హైదరాబాద్‌కు తరలించే యోచన



## వినాయక చవితి వేళ తియ్యని కబురు చెప్పిన తెలంగాణ ప్రభుత్వం

గణేశ్ మండపాలకు, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్
తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
అనుమతి ఉన్న మండపాలకే ఈ సౌకర్యం వర్తింపు
ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు
వేగంగా జరుగుతున్న హైదరాబాద్ గణేశ్ మండపాల ఏర్పాటు
తుది దశకు చేరిన ప్రఖ్యాత ఖైరతాబాద్ విగ్రహం పనులు



## సుప్రీంకోర్టు తీర్పుతో వారిలో భయం మొదలైంది

పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్
పదవులకు రాజీనామా చేసి ఉపఎన్నికల్లో గెలవాలని డిమాండ్
20 నెలల పాలనపై రేవంత్ రెడ్డి ప్రజాతీర్పు కోరాలని వ్యాఖ్య
కాంగ్రెస్ ప్రభుత్వ అప్పులు, హైడ్రా ఆగడాలపై తీవ్ర విమర్శలు
కేసీఆర్ పాలనలో హైదరాబాద్ అభివృద్ధిని గుర్తు చేసిన కేటీఆర్
నాయకులు మోసం చేసినా కార్యకర్తలు పార్టీతోనే ఉన్నారని ప్రశంస



హైదరాబాద్ ఆగస్టు 24 (సిద్దిపేట పవర్):

బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారికి నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే తక్షణమే తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి, ఉప ఎన్నికలను ఎదుర్కొని గెలవాలని ఆయన సవాల్ విసిరారు. ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 20 నెలల పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకొని ఉప ఎన్నికలకు రావాలని, సిద్దిపేట పవర్‌లోనే తేల్చుకుందామని కేటీఆర్ స్పష్టం చేశారు.

పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలలో ఓటమి భయం మొదలైందని కేటీఆర్ అన్నారు. అందుకే వారు రాజీనామా చేసేందుకు వెనుకాడుతున్నారని

# బైపోల్స్‌కి బీఆర్ఎస్ రెడీ..

జూబ్లీహిల్స్‌తో పాటు 10 చోట్ల ఉపఎన్నికలు రానున్నాయా?
సుప్రీం కోర్ట్ తీర్పును అనుకూలంగా భావిస్తున్న బీఆర్ఎస్
ఇప్పటికే కొందరు ఫిరాయింపు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు?
త్వరలోనే మరికొందరికి అంటున్న గులాబీ వర్గాలు
జుబ్లీహిల్స్‌తో పాటు ఆ పది చోట్ల బైపోల్స్ అంటున్న బీఆర్ఎస్
పది నియోజకవర్గాల్లో గెలుపు గుర్రాల కోసం అన్వేషణ
అప్పుడే గెలిచాం, ఇప్పుడు నిలబెట్టుకుంటామన్న నమ్మకం



## యూరియా ఇవ్వకుండా అభాండాలా?

వాస్తవాలు పక్కదారి పట్టేలా కిషన్ రెడ్డి వ్యాఖ్యలు
11 ఏళ్లుగా లేని కొరత ఇప్పుడు ఎందుకొచ్చింది?
కేంద్ర వైఫల్యాలను దాచి రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలా?
యూరియా పక్కదారి పట్టలేదన్న తుమ్మల



హైదరాబాద్ ఆగస్టు 24 (సిద్దిపేట పవర్):

కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో యూరియా కొరతపై కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చూస్తే వాస్తవాలు దాచి ఉల్టా రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదివారం ఈ మేరకు మీడియా ప్రకటన విడుదల చేశారు. యూరియా సరఫరాలో జియో పాలిటిక్స్, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, ఎర్ర సముద్రంలో నౌకాయానం నిలవడం వల్ల యూరియా ఇంపోర్ట్ డిమాండ్‌కు తగ్గ స్థాయిలో లేదని కిషన్ రెడ్డి ఓ పక్క చెబుతూనే మరోపక్క పక్కదారి

## అనుమానంతో భార్యను చంపి ముక్కలుగా నరికి.. మూసీలో పడేసిన కిరాతకుడు

5 నెలల గర్భిణీ అని తెలిసి కూడా దారుణం
ఏమీ ఎరుగనట్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
తమదైన స్టైల్‌లో విచారించగా నేరం అంగీకారం



## ధరావతు కోటి చెల్లించాల్సిందే..!

భూముల వేలంలో హెచ్ఎండీఏ వింత విధానం
గతంలో రూ. 1లక్ష నుంచి రూ. 5లక్షల లోపే..
వడబోత పేరిట 100శాతం పెంచిన హెచ్ఎండీఏ
బడా సంస్థలకే ప్రయోజనం చేసేలా నిర్ణయం




హైదరాబాద్ ఆగస్టు 24 (సిద్దిపేట పవర్):

భూముల వేలం ప్రక్రియలో హెచ్ఎండీఏ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎన్నడూ లేనట్లుగా భూముల వేలంలో పాల్గొనేందుకు తీసుకునే ధరావతు(బయానా లేదా ఈఎండీ)ని అమాంతం పెంచేసింది. దాదాపు 100శాతం ఈఎండీని పెంచగా... వేలానికి ముందే వడపోసేలా హెచ్ఎండీఏ వ్యవహరిస్తోంది. దీంతో హెచ్ఎండీఏ ప్లాట్లు అంటేనే వేలానికి ముందే మరింత ఖరీదుగా మారిపోయాయి. ఒకేసారి భారీ ధరావతు చెల్లించాల్సి రావడంతో సాధారణ వ్యక్తులు కొనలేని పరిస్థితులు ఏర్పడనున్నాయి. వేలానికి ముందే కోట్లలో బయానాగా చెల్లించాలనే నిబంధన వలన... గతంలో మాదిరి అందరూ కొనుగోలు



# దేవుడు డిజైనర్, ప్రకృతి గురువు..

మొదటిపేజీ తరువాయి

చేయకుండా ముందుకు సాగాలని సూచించారు. కృత్రిమ మేధస్సు (AI) కూడా బయోడిజైన్‌కు మంచి ఉదాహరణ అని, సహజ మెదడును ఆధారంగా తీసుకుని మానవులు కృత్రిమ మెదడును సృష్టించారని తెలిపారు.

"మేము తెలంగాణ రైజింగ్ 2047 అనే ప్రయాణాన్ని ప్రారంభించాం. 2034 నాటికి తెలంగాణను $1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి $3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇప్పటికే ఫార్మా, బయోటెక్, లైఫ్ సైన్సెస్, మెడ్‌టెక్ రంగాల్లో దేశంలో ముందంజలో ఉందని సీఎం తెలిపారు. సుల్తాన్‌పూర్‌లో 302 ఎకరాల్లో ఏర్పాటు చేసిన దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైసెస్ పార్క్‌లో 60కి పైగా దేశీయ, అంతర్జాతీయ కంపెనీలు పనిచేస్తున్నాయని చెప్పారు. డయాగ్నస్టిక్ పరికరాలు, ఇమేజింగ్ టెక్నాలజీలు, ఇంప్లాంట్లు, శస్త్రచికిత్స పరికరాలు, డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్‌లో పెట్టుబడులు వస్తున్నాయని వివరించారు.

స్థానిక స్టార్టప్‌లు, MSMEలు కూడా గ్లోబల్ కంపెనీలతో కలసి పనిచేస్తున్నాయని, ప్రభుత్వం పూర్తిగా మద్దతు ఇస్తుందని సీఎం రేవంత్ భరోసా ఇచ్చారు. అవసరమైన సహకారాన్ని అందిస్తామని, డేటా గోప్యతను కాపాడుతూ ప్రజల ఆరోగ్య సేవలకు కావాల్సిన సమాచారం అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పన్నులు, యుద్ధాలు, వాణిజ్య పరమైన అడ్డంకులు కనిపిస్తున్నప్పటికీ, ఆవిష్కరణలకు తెలంగాణే సరైన వేదిక అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. "మనందరం కలసి పనిచేసి మానవాళిని మరింత ఆరోగ్యంగా మార్చడానికి కృషి చేద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు

# సుప్రీంకోర్టు తీర్పుతో వారిలో భయం మొదలైంది

మొదటిపేజీ తరువాయి

ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల బ్లాక్‌మెయిల్ దందాల కోసమే 'హైడ్రా' వ్యవస్థ పనిచేస్తోందని, దాని ఆగడాల వల్ల ఒకప్పుడు దేశానికే తలమానికంగా ఉన్న హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోయిందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పు కంటే, రేవంత్ రెడ్డి కేవలం 20 నెలల కాలంలోనే ఎక్కువ అప్పులు చేశారని విమర్శించారు. అభివృద్ధి గురించి మాట్లాడే ధైర్యం రేవంత్ రెడ్డికి ఉందా అని కేటీఆర్ నిలదీశారు.

గతంలో కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెట్టిందని కేటీఆర్ గుర్తుచేశారు. 2014లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీఆర్ఎస్‌కు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నప్పటికీ, కేసీఆర్ నాయకత్వంలో ఆరు నెలల్లోనే విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు. దీంతో నగరంలో ఇన్వర్టర్లు, జనరేటర్ల అవసరమే లేకుండా పోయిందన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో రాజకీయాలు చేయకుండా హైదరాబాద్‌ను అన్ని వర్గాల ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి ఉండేలా అభివృద్ధి చేశామని చెప్పారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ పండుగలకు సమ ప్రాధాన్యత ఇస్తూ మతసామరస్యాన్ని కాపాడామని అన్నారు. అందుకే 2023 ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా గులాబీ జెండాకే పట్టం కట్టారని ఆయన పేర్కొన్నారు.



శేరిలింగంపల్లి ఎమ్మెల్యేతో సహా పార్టీ మారిన వారంతా ప్రజల కోసం కాదని, కేవలం తమ స్వార్థ ప్రయోజనాలు, ఆర్థిక లాభాల కోసమే కాంగ్రెస్‌లో చేరారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా ప్రజలకు మేలు చేసి ఉంటే, ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి చూపించాలని ఆయన పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం టైంపాస్ మాటలు చెబుతూ, కేసీఆర్‌పైన, తనపైన కేసులు పెడతామని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. నాయకులు పార్టీని మోసం చేసి వెళ్లినా, బీఆర్ఎస్ కార్యకర్తలు మాత్రం గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటున్నారని కేటీఆర్ ప్రశంసించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కేసీఆర్‌కు మళ్లీ అస్వస్థత..

- పర్యవేక్షిస్తున్న ప్రత్యేక వైద్యులు
- షుగర్, సోడియం స్థాయుల్లో హెచ్చుతగ్గులు
- హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందంతో చికిత్స
- ఫాంహౌస్‌కు చేరుకున్న కేటీఆర్, హరీశ్ రావు ఇతర నేతలు
- అవసరమైతే హైదరాబాద్‌కు తరలించే యోచన

హైదరాబాద్ ఆగస్టు 24 (సిద్దిపేట పవర్):

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) శనివారం అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో హైదరాబాద్ నుంచి ప్రత్యేక వైద్యుల బృందం వెంటనే అక్కడికి చేరుకుంది.

విశ్వసనీయ సమాచారం ప్రకారం కేసీఆర్ రక్తంలో చక్కెర (షుగర్), సోడియం స్థాయుల్లో హెచ్చుతగ్గులు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వైద్య బృందం ఆయనకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

తండ్రి అనారోగ్య వార్త తెలియగానే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తన కుమారుడు హిమాన్షుతో కలిసి స్వయంగా కారు నడుపుకుంటూ ఫాంహౌస్‌కు చేరుకున్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి కూడా ఎర్రవల్లికి వచ్చి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ప్రస్తుతం వైద్యుల బృందం ఫాంహౌస్‌లోనే ఉండి కేసీఆర్ ఆరోగ్యాన్ని నిరంతరం గమనిస్తోంది. మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి కూడా అక్కడే ఉండి వైద్య సేవలను పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ఆయన ఆరోగ్యం మెరుగుపడకపోతే, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించే అవకాశం ఉందని తెలుస్తోంది.



# బైపోల్స్‌కి బీఆర్ఎస్ రెడీ..

## జూబ్లీహిల్స్‌తో పాటు 10 చోట్ల ఉపఎన్నికలు రానున్నాయా?

- సుప్రీం కోర్ట్ తీర్పును అనుకూలంగా భావిస్తున్న బీఆర్ఎస్
- ఇప్పటికే కొందరు ఫిరాయింపు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు?
- త్వరలోనే మరికొందరికి అంటున్న గులాబీ వర్గాలు
- జూబ్లీహిల్స్‌తో పాటు ఆ పది చోట్ల బైపోల్స్ అంటున్న బీఆర్ఎస్
- పది నియోజకవర్గాల్లో గెలుపు గుర్రాల కోసం అన్వేషణ
- అప్పుడే గెలిచాం, ఇప్పుడు నిలబెట్టుకుంటామన్న నమ్మకం

హైదరాబాద్ ఆగస్టు 24 (సిద్దిపేట పవర్):

బీఆర్ఎస్ బై పోల్ మూడ్‌లోకి వచ్చేసిందా? అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలుపెట్టిందా? ఎప్పుడు సైరన్ మోగినా మేము సై అంటూ సిద్ధమైపోతోందా? అసలిప్పుడు ఎందుకు హడావిడి చేస్తోంది కారు పార్టీ? ఏ ఉప ఎన్నికల కోసం సిద్ధమవుతోంది. జూబ్లీహిల్స్ తప్ప మిగతా చోట్ల ఇప్పటికిప్పుడు ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉందా? గులాబీ లెక్కలేంటి? 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీ ఫామ్ మీద గెలిచి... తర్వాత కాంగ్రెస్‌లోకి జంప్ అయిపోయారు పది మంది ఎమ్మెల్యేలు. వాళ్ళ మీద అనర్హత వేటు వేయాలంటూ అసెంబ్లీ స్పీకర్‌ని కోరింది బీఆర్ఎస్. ఆ పోరాటంలో భాగంగా సుప్రీం కోర్ట్ దాకా వెళ్ళింది. తాజాగా వచ్చిన తీర్పు తమకు అనుకూలంగా ఉన్నట్టు భావిస్తున్నారు గులాబీ నేతలు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల సంగతిని మూడు నెలల్లోగా తేల్చమని స్పీకర్‌కు సూచించింది సుప్రీమ్ కోర్ట్. అందులో భాగంగా కొందరు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు బీఆర్ఎస్ లీడర్స్. మరి కొంత మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా త్వరలో నోటీసులు అందుకోబోతున్నారంటూ ప్రచారం చేస్తున్నారు. ఇదంతా చూస్తుంటే... వాళ్ళ మీద ఖచ్చితంగా అనర్హత పడుతుందని కారు పార్టీ గట్టిగా నమ్ముతున్నట్టుందని అంటున్నారు పరిశీలకులు. నిజంగానే అనర్హత వేటు పడితే.. ఆ పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయం. అవి కూడా ఎంతో దూరంలో లేవని, జూబ్లీహిల్స్ బైపోల్‌తో పాటే జరుగుతాయని నమ్ముతోందట కారు పార్టీ అధిష్ఠానం. అందుకే ఆయా నియోజకవర్గాల మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టబోతున్నట్టు సమాచారం.

పార్టీ మారిపోయిన ఎమ్మెల్యేలకు ప్రత్యామ్నాయ నేతల్ని సిద్ధం చేసే కార్యక్రమం మొదలైపోయిందట. అందులో భాగంగానే... గెలుపు గుర్రాల కోసం అన్వేషణ మొదలైనట్టు తెలిసింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ గాలి వీచినా.... ఆయా నియోజకవర్గాల్లో తమ పార్టీ గెలిచింది కాబట్టి....ఇప్పుడు ఉప ఎన్నికలంటూ జరిగితే... తిరిగి దతమ ఖాతాలోనే పడిపోతాయన్నది బీఆర్ఎస్ పెద్దల నమ్మకం అట. ఈసారి టిక్కెట్స్‌ను అధిష్టానానికి దగ్గరగా ఉన్న వాళ్లకి, గెలిచాక కూడా పక్క చూపులు చూడని వాళ్ళకు ఇవ్వాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. పది నియోజకవర్గాల్లో అలాంటి వాళ్ళు ఎవరున్నారని వెదుకుతున్నారట. శేరిలింగంపల్లిలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పటాన్‌చెరులో ఆదర్శ్ రెడ్డి, స్టేషన్ ఘన్పూర్‌లో మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య, ఖైరతాబాద్ నుంచి మన్నే గోవర్ధన్ రెడ్డి, రాజేంద్రనగర్‌లో సబితా ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి, జగిత్యాలలో ఎమ్మెల్సీ ఎల్ రమణ, బాన్సువాడ నుంచి ఆర్టీసీ మాజీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, గద్వాలలో హనుమంతు నాయుడు లేదా కాంగ్రెలో ఉన్న వారిని లాక్కునే అవకాశం ఉందని అంటున్నారు.



ఇక భద్రాచలంలో రేగా కాంతారావుకు, చేవెళ్ల నుంచి కొత్త వారికి టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఇక వీళ్లు మాత్రమే కాకుండా... ఉప ఎన్నికలంటూ జరిగితే ఆ టైంకి కాంగ్రెస్ నుంచి గానీ లేకుంటే వేరే పార్టీల నుంచి బలమైన నాయకులు ఎవరైనా ఆసక్తిగా ఉంటే వాళ్ళనుగాని చేర్చుకుని గెలిపించుకునేలా ప్లాన్ చేస్తోందట బీఆర్ఎస్ అధిష్ఠానం. వాళ్ళు ఊహిస్తున్నట్టుగా... ఒకవేళ ఈ 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరిగితే మాత్రం... ఆ ఫైట్ అసెంబ్లీ సాధారణ ఎన్నికల్ని మించి పోతుంది. అందుకే ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి పెడుతున్నారట. నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించుకుంటూ... అక్కడ ఇన్చార్జ్‌లను నియమిస్తూ... క్యాడర్ ను ఉత్తేజపరచాలని చూస్తున్నారట. ఒకవేళ స్పీకర్ నిర్ణయం తీసుకొని వాళ్లపై అనర్హత వేటు వేస్తే... ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉంది కాబట్టి. ముందుగానే అలర్ట్ అవుతోందట గులాబీ పార్టీ. ఈ ముందస్తు ఏర్పాట్లు సఫలం అవుతాయో లేదో చూడాలి మరి.

# వినాయక చవితి వేళ తియ్యని కబురు చెప్పిన తెలంగాణ ప్రభుత్వం

- గణేశ్ మండపాలకు, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్
- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- అనుమతి ఉన్న మండపాలకే ఈ సౌకర్యం వర్తింపు
- ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాలు
- వేగంగా జరుగుతున్న హైదరాబాద్ గణేశ్ మండపాల ఏర్పాటు
- తుది దశకు చేరిన ప్రఖ్యాత ఖైరతాబాద్ గణపతి విగ్రహం పనులు

హైదరాబాద్ ఆగస్టు 24 (సిద్దిపేట పవర్):

తెలంగాణలో పండుగ వాతావరణం నెలకొంటున్న వేళ, రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవ నిర్వాహకులకు ఒక తీపికబురు అందించింది. వినాయక చవితి, దసరా నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసే గణేశ్, దుర్గామాత మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని, అయితే నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొంది ఉండాలని స్పష్టం చేసింది. ఈ నెల 27వ తేదీ నుంచి గణేశ్ చతుర్థి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో ప్రభుత్వ నిర్ణయంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాజధాని హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో మండపాల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముఖ్యంగా, తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహ నిర్మాణ పనులు తుది ఘట్టానికి చేరుకున్నాయి. ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ప్రకటించడంతో ఈ ఏడాది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో మండపాలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గనుంది.




# యూరియా ఇవ్వకుండా అభాండాలా?

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తున్నదని ఆరోపణలు చేయడం ద్వంద వైఖరికి నిదర్శనం అని మండిపడ్డారు. యూరియా దిగుమతులు లేక దేశీయంగా ఉత్పత్తి డిమాండ్‌కు తగ్గ స్థాయిలో లేక నెలకొన్న కొరతపై వాస్తవాలు దాయడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా యూరియా కొరత నెలకొంటే రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లేలా కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేయడం కేంద్రమంత్రి స్థాయికి తగినట్లు లేదని హితవు పలికారు. తెలంగాణ ప్రజానీకం మీకు ఓట్లు వేసి గెలిపిస్తేనే కేంద్ర మంత్రి అయ్యారన్నారు. రైతుల యూరియా కష్టాలు తీరేలా కేంద్ర మంత్రిగా మీరు చొరవ తీసుకుని సరఫరా చేయించండి, అదనంగా సరఫరా చేయిస్తే కృతజ్ఞతలు తెలుపుతామని చెప్పారు. అలా చేయకుండా కేంద్రం అలసత్వంతో ఏర్పడిన యూరియా కొరతపై వాస్తవాలు దాచి రాజకీయ ఆరోపణలు చేయడం తగదని మండిపడ్డారు. మంత్రులు పదే పదే చెప్పడం వల్లే రైతులు యూరియా ముందే కొనుక్కునే ప్రయత్నం చేస్తున్నారన్న కిషన్ రెడ్డి వ్యాఖ్యలు బురద జల్లేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా సరఫరాలో జాప్యం ఇంపోర్ట్ లేకపోవడం దేశీయంగా ఉత్పత్తి లేకపోవడం వల్లేనన్న వాస్తవాలు మంత్రులు రైతులకు వివరిస్తుంటే అభాండాలు వేయడం ఏమిటని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇది మూడో పంటకాలమని, గత ఏడాదిన్నర కాలంలో యూరియా కోసం రైతులు ఎప్పుడూ ఆందోళన చెందలేదన్నారు. కేంద్రం కేటాయించిన యూరియా సకాలంలో సరఫరా చేయకపోవడం వల్లే రైతులు ఆందోళన చెందుతున్నారని, వాస్తవాలు దాచి రాజకీయ ఆరోపణలు చేయడం తగదని కిషన్ రెడ్డిపై ఫైరయ్యారు. కేంద్ర మంత్రి హోదాలో బాధ్యతగా కేంద్రం ప్రకటించిన 50 వేల టన్నుల యూరియా తక్షణమే సరఫరా అయ్యేలా చూడాలని రైతుల పక్షాన తుమ్మల విజ్ఞప్తి చేశారు.




# ధరావతు కోటి చెల్లించాల్సిందే..!

మొదటిపేజీ తరువాయి

చేసే వీల్లేకుండా పోతుంది.

హెచ్ఎండీఏ భూముల వేలం అంటేనే నగరంలో ఇదొక హాట్ టాపిక్. గతంలో ఎకరం వంద కోట్లకు ఈ వేలంలో దక్కించుకుని రియల్ వ్యాపారాన్ని పరుగులు పెట్టించిన సందర్భాలు ఉన్నాయి. కానీ ఇప్పుడు అందుకు భిన్నంగా వేలం పాటలో పాల్గొనాలంటే కోటి ఖర్చు చేస్తే గానీ వీలు కాదనీ నిబంధనలు ముందుకు తీసుకువచ్చింది. గతంలో ప్లాట్ల సైజుల వారీగా కాకుండా భూముల వేలంలో పాల్గొనేందుకు ధరావతును రూ. 1లక్ష నుంచి రూ. 5లక్షల వరకు నిర్ణయించారు. ఒక్క కోకాపేట్ మినహా ఏ వెంచర్‌లోనైనా ఇదే తీరుగా అమలు చేశారు. కానీ ఇప్పుడు వెంచర్‌తో సంబంధం లేకుండా హెచ్ఎండీఏ విక్రయిస్తున్న ప్లాట్లను సొంతం చేసుకోవాలంటే కోటి రూపాయలు ముందుగానే చెల్లింపులు జరిపితే గానీ సాధ్యం కానీ పరిస్థితి వచ్చింది.

**వంద శాతం పెంపుతో..**

బయానా మొత్తాన్ని వంద శాతం పెంచడంతో రూ. లక్ష నుంచి ఒక్కసారి కోటి రూపాయలకు చేరింది. దీంతో గతంలో లక్ష రూపాయలు చెల్లించి ఆన్‌లైన వేలంలో పాల్గొనే వారి సంఖ్య ఇప్పుడు పరిమితం కానుంది. అయితే వేలంపాటలో కొనుగోలు చేసేవారి కోసం వాయిదా విధానంలో చెల్లించుకునే వెసులుబాటు కూడా ఉండేది. దీంతో లక్ష రూపాయలతో వేలంలో పాల్గొని, ఒకవేళ ప్లాటు దక్కితే వాయిదా పద్ధతిలో చెల్లించుకునే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు రూ. కోటిని ముందుగానే చెల్లించాలని చెప్పడం వలన వేలం ప్రక్రియ మరింత జటిలం కానుంది. దీంతో పరిమిత కొనుగోలుదారులతో వేలం పాట జరిగే అవకాశం ఉందని అధికారులు కూడా చర్చించుకుంటున్నారు.




**వేలానికి ముందే వడపోత...**

హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు మాత్రం గతంలో వేలం పాటలో కొనుగోలు చేసి, ఆ తర్వాత వాయిదా పద్ధతిలో ప్లాట్లకు డబ్బులు చెల్లించలేని వారే ఎక్కువ ఉన్నట్లుగా చెబుతున్నారు. అందుకే ధరావతు మొత్తాన్ని రూ. కోటికి పెంచడం వలన అనవసరంగా పాల్గొనే వారి సంఖ్య తగ్గుతుందని భావిస్తున్నారు. కానీ మంది ఎక్కువగా ప్లాట్ల కోసం పోటీ పడినప్పుడే ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కూడా పెరుగుతుంది. ఇప్పుడు కోటి రూపాయలు ముందుగా చెల్లించిన వారు మాత్రమే వేలంలో పాల్గొనేలా ముందస్తు వడపోత కారణంగా... వేలానికి ఆదరణ ఆశించిన స్థాయిలో రాదనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలా హెచ్ఎండీఏ తీసుకున్న నిర్ణయం కేవలం బడా నిర్మాణ సంస్థలకు మాత్రమే లబ్ధి చేకూర్చుతోందనే వాదనలు ఉన్నాయి. దీంతో ఎగువ మధ్యతరగతి, సాధారణ ఎన్ఆర్ఐ వర్గాల నుంచి పెట్టుబడులు తగ్గే అవకాశం ఉంటుంది.

# రాహుల్ గాంధీ 'ఓట్ల చోరీ' ఆరోపణలకు రాజ్ థాకరే మద్దతు!

- ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కయ్యాయని రాహుల్ విమర్శ
- ఈ అంశాన్ని తాను 2016-17లోనే లేవనెత్తానని చెప్పిన థాకరే
- ఎన్నికలను బహిష్కరించాలన్న తన సూచనను ప్రతిపక్షాలు పట్టించుకోలేదని వ్యాఖ్య
- ఓటర్ల జాబితాలపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపు

నేషనల్‌బ్యూరో ఆగస్టు 24 (సిద్దిపేట పవర్):

దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియలో 'ఓట్ల చోరీ' జరుగుతోందంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన తీవ్ర ఆరోపణలకు మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ థాకరే అనూహ్యంగా మద్దతు పలికారు. ఈ అంశంపై తాను ఎప్పటినుంచో పోరాడుతున్నానని, ప్రతిపక్షాలు తన మాట వినలేదని ఆయన అన్నారు.

పూణేలో శనివారం జరిగిన పార్టీ ఆఫీస్ బేరర్ల సమావేశంలో రాజ్ థాకరే మాట్లాడుతూ "ఓట్ల తారుమారు అంశం కొత్తదేమీ కాదు. నేను 2016 17లోనే ఈ విషయాన్ని లేవనెత్తాను. అప్పట్లో శరద్ పవార్, సోనియా గాంధీ, మమతా బెనర్జీ వంటి నేతలను కలిసి మాట్లాడాను. లోక్‌సభ ఎన్నికలను బహిష్కరిస్తే ప్రపంచం దృష్టిని ఆకర్షించవచ్చని, అంతర్జాతీయంగా ఒత్తిడి పెరుగుతుందని సూచించాను. కానీ అందరూ భయపడి వెనక్కి తగ్గారు" అని విమర్శించారు. ఇప్పుడు రాహుల్ గాంధీ మళ్లీ అదే అంశాన్ని ప్రస్తావించారని థాకరే గుర్తుచేశారు.



"ప్రజలు ఓట్లు వేస్తున్నారు, కానీ ఆ ఓట్లు అభ్యర్థులకు చేరడం లేదు. వాటిని దొంగిలిస్తున్నారు. 2014 నుంచి ఈ ఎన్నికల గందరగోళాన్ని ఉపయోగించుకునే ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి" అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఉదాహరణగా చూపుతూ.. బీజేపీ 132, ఏక్‌నాథ్ షిండే వర్గం 56, అజిత్ పవార్ వర్గం 42 సీట్లు గెలిచినా, ఆ ఫలితాలను గెలిచినవారు గానీ, ఓడినవారు గానీ జీర్ణించుకోలేకపోయారని వ్యాఖ్యానించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన తన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఈ నెల ప్రారంభంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం బీజేపీతో కుమ్మక్కై ఎన్నికలను దొంగిలిస్తోందని ఆరోపించారు. కర్ణాటకలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో 6.5 లక్షల ఓట్లకు గాను లక్షకు పైగా ఓట్ల చోరీ జరిగిందని, ఓటర్ల జాబితాలో నకిలీ పేర్లను చేర్చుతున్నారని విమర్శించారు. అయితే, ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం తీవ్రంగా ఖండించింది. ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలని, లేదంటే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. దీనిపై రాహుల్ గాంధీ స్పందించలేదు.

## నీళ్లు లేక 19 వ వార్డు ప్రజలకు ఇబ్బందులు

- నెల రోజుల నుండి పట్టించుకోని అధికారులు
- 19 వ వార్డులో చెడిపోయిన బోర్ మోటార్
- పలుసార్లు అధికారులకు చెప్పిన పట్టించుకున్న పాపాన పోలేదు
- మీ ఇష్టం ఉంటే మీరే చేయించుకోండి నేను చేయను అంటూ బోర్ మెకానిక్ వెల్లడి
- కమిషనర్ ఇప్పటికైనా స్పందించాలని వార్డు ప్రజల ఆవేదన



**సిద్ధిపేట పవర్ న్యూస్ ఆగస్టు 24ప్రతినిధి**

నెలకు పైచిలుకుగా 19 వ వార్డులో ఉన్న బోరు మోటర్ చెడిపోయిన నేటి వరకు కూడా మున్సిపల్ సిబ్బంది పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 19వ వార్డులో గత నెల రోజులగా బోరు మోటర్ చెడిపోయిందని మున్సిపల్ సిబ్బందికి విషయం తెలుపగా , సిబ్బంది ఆదేశాల మేరకు మున్సిపల్ మెకానిక్ అక్కడికి వచ్చి బోర్ మోటార్స్ చూసి ఇది కాలిపోయింది, మీరే చేయించుకోండి అంటూ వార్డు ప్రజలకు చెప్తూ వెళ్లిపోవడం చాలా బాధాకరంగా ఉందన్నారు. మున్సిపల్ సిబ్బంది ఇలా వ్యవరిస్తే సామాన్య ప్రజలకు అధికారులు ఏలా న్యాయం చేస్తారో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా మున్సిపల్ అధికారులు , సిబ్బందికి ఏ విషయాలు చెప్పినా సిబ్బంది మాత్రం నామమాత్రంగా వింటూ పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి బోరు మోటర్ రిపేర్ చేసి నీటి సమస్యను తీర్చాలని కోరారు.

## విద్యార్థుల ను సామాజిక బాధ్యత పై చైతన్యం తేవాలి..




**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు 24 ప్రతినిధి**

తెలంగాణ ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆవిర్భావం (టిపి ఎస్ ఏ) సిద్దిపేట జిల్లా టిపిఎస్ఏ నూతన కార్యవర్గం ఎన్నిక అధ్యక్షుడిగా భగవాన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రజనీకాంత్ రెడ్డి అభినందించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (టిపిఎస్ఏ) ఆవిర్భావం జరిగింది.. సిద్దిపేట జిల్లా నూతన కార్యవర్గన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పి.భగవాన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రజనీకాంత్ రెడ్డిలు ఎన్నికయ్యారు. అలాగే కోశాదికరిగా జీ.సంపత్, ఉపాధ్యక్షులుగా సంతోష్ కుమార్, లింగం, కోశాధికారిగా జి సంపత్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఏం.రమేష్, ముఖ్య సలహదారులుగా జి వెంకటేష్, కిరణ్, ఉదయాకర్,మాళవిక, లావణ్య రెడ్డి, లీగల్ అడ్వైజర్ గా సిహెచ్ సంతోష్ కుమార్ లను ఎన్నుకోవడం జరిగింది. నూతన కార్యవర్గం మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు కలిసారు ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందించారు.. ఉపాధ్యాయులు విద్యార్థుల ను సామాజిక బాధ్యత వైపు చైతన్యం తేవాలని సూచించారు.. పిల్లలు డ్రగ్స్ ఆన్ లైన్ గేమ్స్ వైపు వెళ్లకుండా అవగాహన కలిపించాలని చెప్పారు.. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ త్వరలోనే నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. ఈ టిపిఎస్ఎ అసోసియేషన్ కి అధ్యక్షులుగా మాజీ మంత్రి వర్యులు, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఉంటారన్నారు. ఎన్నిక ముందు ఎమ్మెల్యే హరీష్ రావు కలిసి సలహా సూచనలు తీసుకోవడం జరిగిందన్నారు. ఎన్నికలు టిపిఎస్ఎ సభ్యులు పాల్గొనడం జరిగింది. తమపై నమ్మకం పెట్టి ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు



## శ్రవణ్ మహేష్ మృతి ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే

- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- పంచాయతీ కార్యదర్శులు అప్పులో కూడుకుపోయిన పట్టించుకోని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్
- మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు





**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం:** నాయిని శ్రవణ్ కొంతం మహేష్ ది ముమ్మాటికి ప్రభుత్వ హత్యనే అని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. జగదేవపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో పారిశుధ్య పనులు సరిగా చేయక డెంగ్యూ మలేరియా విషాజ్వరాలు తో ప్రజలు ఆస్పత్రుల పాలయితున్నారని విష జ్వరాలతో లక్షల లక్షలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడ్డట్టుగా వ్యవహరిస్తుందని గ్రామాల్లో కనీసం పారిశుధ్య పనులు కూడా సక్రమంగా చేయని కాంగ్రెస్ దద్దమ్మ ప్రభుత్వమని గ్రామపంచాయతీలో నిధులు లేక పంచాయతీ సెక్రటరీలు అప్పుల పాలయితున్నారని కనీసం వారి జీతాలు కూడా ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన పెట్టి కనీసం అధికారులకు బ్లీచింగ్ పౌడర్ గాని గడ్డి మందు గానీ ఇంతవరకు గ్రామపంచాయతీకి ఇవ్వలేని ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని హెద్దేవ చేశారు. సర్పంచులకు పెండింగ్ బకాయి బిల్లులు ఇవ్వలేదని, కాంటాక్టకు లక్షల కోట్లు బిల్లులు పాస్ చేస్తున్నారని తెలిపారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు యూరియా కోసం హరి గోస పడత లేరని అన్నారు. టిఆర్ఎస్ హయాంలో రేవ్ గోడాన్స్ లో 35 వేల మెట్రిక్ టన్నుల యూరియా స్టాకు నిలిచిందని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆయంలో కనీసం 3 వేల యూరియా కూడా ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నాయిని మహేందర్ గ్రామ బి అర్ ఎస్ పార్టీ అధ్యక్షులు , కుమారుడు నాయిని శ్రవణ్ కుమార్ ( 16 ) డెంగ్యూ జ్వరం తో మృతి చెందాడు.అదే గ్రామానికి చెందిన కొంతం మహేష్ ( 32 ) రెండు రోజుల డెంగ్యూ జ్వరం తో మృతి చెందాడు,ఆదివారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట రాష్ట్ర మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీపీ బాలేషం గౌడ్,పిఎసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి మండల బి అర్ ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ లు,ఎంపిటిసి లు,మండల కో ఆప్షన్ ఎక్బాల్,మార్కెట్ మాజీ చైర్మన్ ,వైస్ చైర్మన్, పార్టీ అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

# అనుమానంతో భార్యను చంపి ముక్కలుగా నరికి..

- మూసీలో పడేసిన కిరాతకుడు
- 5 నెలల గర్భిణీ అని తెలిసి కూడా దారుణం
- ఏమీ ఎరుగనట్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- తమదైన స్టైల్‌లో విచారించగా నేరం అంగీకారం

**హైదరాబాద్ ఆగస్టు 24 (సిద్దిపేట పవర్):**

ప్రేమించానన్నాడు. నువ్వు లేనిదే బతకలేనని నమ్మించాడు. పెళ్లి చేసుకున్నాడు. ఆ తరువాత అనుమానమనే భూతం పట్టడంతో రాక్షసుడిలా మారాడు. 5 నెలల గర్భిణీ అనే జాలి కూడా లేకుండా నమ్మి తాళి కట్టించుకున్న భార్య గొంతు కోసి హత్య చేశాడు. మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా చేసి శరీర భాగాలను ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసి మూసీలోకి విసిరేశాడు. ఆ తరువాత ఏమీ ఎరుగనట్టు బంధువుతో కలిసి స్టేషన్‌కు వెళ్లి తన భార్య కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేశాడు. చివరకు పోలీసులకు దొరికిపోయాడు. సంచలనం సృష్టించిన ఈ కిరాతక ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఏసీపీ చక్రపాణితో కలిసి ఆదివారం మీడియా సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు.

**ఇద్దరిదీ ఒకే ఊరు**

వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడకు చెందిన సామల మహేందర్ రెడ్డి (27) అదే గ్రామానికి చెందిన స్వాతి అలియాస్ జ్యోతి(21)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఇరుగుపొరుగునే ఇండ్లు ఉండడంతో ఇద్దరి మధ్య ముందు పరిచయం ఏర్పడింది. స్వాతిని ఇష్టపడ్డ మహేందర్ రెడ్డి అదే విషయాన్ని ఆమెతో చెప్పాడు. ప్రేమిస్తున్నాను పెళ్లి చేసుకుందామన్నాడు. మొదట్లో ఇరువైపులా పెద్దలు వీరి వివాహానికి అంగీకరించలేదు. ఒకరిని విడిచి మరొకరం ఉండలేమని మహేందర్ రెడ్డి, స్వాతి మొండి పట్టు పట్టడంతో చివరకు ఒప్పుకొన్న పెద్దలు గతేడాది జనవరి 20న కూకట్‌పల్లి ఆర్య సమాజ్‌లో వివాహం జరిపించారు. ఆ తరువాత ఇద్దరు బోడుప్పల్ ఈస్ట్ బాలాజీహిల్స్ ప్రాంతంలోని శ్రీనివాస్ నగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని కాపురం పెట్టారు. స్వాతి పంజాగుట్టలోని ఎబెక్స్ కాల్ సెంటర్‌లో ఉద్యోగంలో చేరగా మహేందర్ రెడ్డి ర్యాపిడో డ్రైవర్‌గా పని చేయడం ప్రారంభించాడు.

**పెళ్లయిన నెల రోజుల నుంచే..**

వివాహమైన తరువాత మొదటి నెల వీరి కాపురం ఆనందంగానే సాగింది. స్వాతి కాల్ సెంటర్‌లో ఉద్యోగం చేస్తుండడం, తరచూ ఫోన్లు మాట్లాడుతుండడంతో మహేందర్ రెడ్డిలో అనుమానం మొదలైంది. ఈ క్రమంలో ఆమెను అనుమానించడం మొదలు పెట్టి చిన్న చిన్న విషయాలపై గొడవలు పెట్టుకోవడం ప్రారంభించాడు. స్వాతితో ఉద్యోగం కూడా మానిపించేశాడు. ఆ తరువాత భార్యను తీసుకుని ఊరికి వెళ్లిపోయాడు. అక్కడ కూడా స్వాతితో గొడవలు పడడాన్ని కొనసాగించాడు. నానాటికీ మహేందర్ రెడ్డి వేధింపులు ఎక్కువ అయిపోవడంతో భరించలేకపోయిన స్వాతి పెళ్లయిన 3 నెలలకే వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసులు కూడా నమోదయ్యాయి. అయితే, గ్రామ పెద్దలు పంచాయితీ జరిపి ఇద్దరికీ నచ్చజెప్పారు. దాంతో వివాదం సద్దుమణిగింది. ఆ తరువాత రెండు నెలలకు మళ్లీ శ్రీనివాస్ నగర్‌కు వచ్చి అంతకుముందు ఉన్న ఇంటిలోనే అద్దెకు దిగారు. ఇటువంటి పరిస్థితుల్లోనే స్వాతి మార్చి





నెలలో గర్భం దాల్చింది. ప్రస్తుతం ఆమె 5 నెలల గర్భిణీ. అయితే, దీనికి కారణం తాను కాదని అనుమానించాడు. శుక్రవారం స్వాతి తాను ఈ నెల 27న ఊరికి వెళతానని మహేందర్ రెడ్డితో చెప్పింది. వైద్య పరీక్షలు చేయించుకున్న తరువాత పుట్టింటికి పోతానని తెలిపింది. దీనికి మహేందర్ రెడ్డి అంగీకరించలేదు. దాంతో ఇద్దరి మధ్య పెద్ద గొడవ జరిగింది. అప్పుడే స్వాతిని చంపేయాలని నిర్ణయించుకున్నాడు.

**భార్యను చంపాలని.. రంపం కొని..**

భార్యను చంపాలని పథకం ప్రకారం మహేందర్ రెడ్డి బోడుప్పల్‌లోని ఓ షాపు నుంచి గ్రిప్ యాక్సా బ్లేడ్ (రంపం) కొని తెచ్చి ఇంటిలో పెట్టాడు. శనివారం ఇంటి యజమాని కుటుంబం బయటకు వెళ్లడంతో అదే అదునుగా భావించి భార్యను గొంతు కోసి కిరాతకంగా హత్య చేశాడు. ఆ తరువాత తల, చేతులు, కాళ్లను ముక్కలు ముక్కలుగా నరికేశాడు. వాటిని ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసి ప్రతాప సింగారం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నదిలోకి విసిరేశాడు. ఛాతీ భాగాన్ని ఏం చేయాలో అర్థంగాక ఇంటిలోనే పెట్టుకున్నాడు. ఆ తరువాత బంధువుతో కలిసి ఉప్పల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన భార్య కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేశాడు. అయితే, శ్రీనివాస్ నగర్ మేడిపల్లి స్టేషన్ పరిధిలో ఉండడంతో అక్కడ కంప్లయింట్ ఇవ్వాలని ఉప్పల్ పోలీసులు చెప్పారు. ఈ క్రమంలో మహేందర్ రెడ్డి బంధువుతో కలిసి మేడిపల్లి స్టేషన్‌కు వెళ్లాడు. అతని వాలకంపై అనుమానం వచ్చిన సీఐ గోవింద రెడ్డి, ఎస్ఐ నర్సింగ్ రావులు నిశితంగా ప్రశ్నించగా మహేందర్ రెడ్డి చేసిన నేరాన్ని అంగీకరించాడు. ఈ క్రమంలో పోలీసులు అతని ఇంటి నుంచి స్వాతి మృతదేహంలోని ఛాతీ భాగాన్ని స్వాధీనం చేసుకున్నారు. మూసీలోకి విసిరేసిన మిగితా శరీర అవయవాల కోసం గాలింపు జరిపినా దొరకలేదు. గాలింపును కొనసాగిస్తామని డీసీపీ పద్మజ చెప్పారు. కేసులో మరిన్ని ఆధారాలు సేకరించాల్సి ఉన్నందున విచారణను కొనసాగించనున్నట్టు తెలిపారు.



## ముస్త్యాల సులోచనకు ఎంపీ చామల ఘన నివాళి

**చేర్యాల, ఆగస్టు 24 (సిద్దిపేట పవర్)** కొమురవెల్లి దేవస్థానం ఆలయం మాజీ చైర్మన్ ముస్త్యాల కిష్టయ్య సతీమణి ముస్త్యాల సులోచన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందిన విషయం విధితమే కాగా ఆదివారం సులోచన దశదిన కర్మ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి హాజరై ఆమె చిత్రపటానికి పూలు చల్లి, శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సులోచన భర్త కిష్టయ్య , కుటుంబ సభ్యులను ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి పరామర్శించారు. శోకతప్త హృదయులైన కుటుంబసభ్యులను ఓదార్చారు. కిష్టయ్య కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సులోచనను స్మరిస్తూ గీతాలను ఆలపిస్తూ కళాకారులు నీరాజనం పలికారు. పిన్నింటి రత్నం కళా బృదాం స్మరిస్తూ గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో, జెడ్పి ఫ్లోర్ లీడర్ గిరి కొండల్ రెడ్డి, మండల అధ్యక్షులు కొమ్ము రవి,మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగ రావు,ఉడుముల భాస్కర్ రెడ్డి, అది శ్రీనివాస్, కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ చెవిటి లింగం,మాజీ ఎంపీటీసీ పల్లె కనకయ్య పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరై సులోచనకు నివాళులార్పించారు..

## ముదిరాజులను బి.సి.డి నుండి బి.సి.ఏ కి మార్చాలి

- మేమెంతో మాకాంత వాటా కల్పించాలి
- ముదిరాజుల పల్లె బాట కార్యక్రమం
- టీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడ సుంకర బోయిన మహేష్,జిల్లా అధ్యక్షులు చెంది శ్రీనివాస్ ముదిరాజు

**సిద్దిపేట ఆగస్ట్24**


ముదిరాజులను బి.సి.డి నుండి బి.సి.ఏ కి మార్చాలని టీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి మహేష్ డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షులు చెంది శ్రీనివాస్ ముదిరాజు తో కలిసి రాష్ట్ర అధ్యక్షులు మహేష్ మాట్లాడారు. తెలంగాణ ముదిరాజు పోరాట సమితి ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించామన్నారు. ముదిరాజులు సమస్యలతో పట్నం బాట పట్టకుండా మేమె పల్లె పల్లెలు తిరుగుతూ ముదిరాజుల సమస్యలు పరిష్కరించెంతవరకు ముదిరాజులము వెనుకడుగు వేయమని వెల్లడించారు. 57.సం. నిండిన మత్యకారులకు పింఛన్లు కేటాయించాలి..123కోట్ల చేప పిల్లలను పంపిణీ చేస్తామని చెప్పి 3 కోట్ల చేప పిల్లలను మభ్య పెడుతున్నారని డిమాండ్ చేశారు. ముదిరాజుకు సరైన వాటా కల్పించాలని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో ముదిరాజుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ నుండి జడ్పీటీసీ పదవుల వరకు ముదిరాజుకు అవకాశం కల్పించాలని గ్రామలల్లో పెద్దమ్మ గుల్ల అభివృద్ధి కి 10 లక్షల ఆర్థిక సాయం అందజేయాలన్నారు. మేమెంతో మాకాంత వాటా కల్పించాలని డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పారవేని రంజిత్ ముదిరాజ్ ,వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్ ముదిరాజ్, ఉప అధ్యక్షులు అశోక్ ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, కార్యదర్శులు కరుణాకర్,ప్రవీణ్ ముదిరాజ్, దుబ్బాక సత్తాన్న,శ్రీశేలం ముదిరాజ్, బుస్స వంశీ ముదిరాజ్, నవీన్ ముదిరాజ్,దత్తు ముదిరాజ్, నరేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు





## ముదిరాజుల పోరాట సమితి ఆధ్వర్యంలో ముదిరాజ్ ల పల్లె బాట కార్యక్రమం

ముదిరాజుల పోరాట సమితి పల్లె బాట కార్యక్రమం నీలం మధు ఆదేశానుసారం ముదిరాజుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాగుల రాజు ముదిరాజ్ హేమ సురేష్ ముదిరాజ్ మండల మహిళా అధ్యక్షురా లు కొన్నే జయమ్మ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా ముదిరాజు పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుంకరబోయిన మహేష్ ముదిరాజ్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు జగదేవపూర్ మండలం మునిగడప గ్రామంలో టి యస్ ఎంపీ యస్ ముదిరాజుల పల్లె బాట కార్యక్రమం మునిగడప గ్రామం నుండే ప్రారంభించమని అన్నారు. అదేవిధంగా ముదిరాజుల సమస్య లు పరిష్కారం దిశగా ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవడానికి ఉద్యమిస్తున్నామని అన్నారు. మత్స్యకారులకు ఇన్సూరెన్స్ కార్డు రెన్యూవల్ మంజూరు గురించి ప్రభుత్వంతో మాట్లాడడానికి ఈ పల్లెబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అన్నట్టుగా రాష్ట్రంలో ముదిరాజులు అత్యధికంగా ఉన్నారని ఆయనే చెప్పారని తెలిపారు. కాబట్టి ముదిరాజులకు స్థానిక సంస్థల్లో అధిక సీట్లు కేటాయించాలని ఎమ్మెల్సీ ఎమ్మెల్యే సీట్లలో కేటాయింపులు చేయాలని తెలిపారు. ఈ పల్లెబాట కార్యక్రమం ముదిరాజుల సమస్యలపై పోరాడుతూ హైదరాబాదులో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కేశమైన శేఖర్ ఉపాధ్యక్షుడు రంజిత్ ముదిరాజ్ అశోక్ ముదిరాజ్ వివిధ గ్రామాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు మాజీ సర్పంచులు మాజీ ఉప సర్పంచ్ లు ముదిరాజులు తదితరులు పాల్గొన్నారు.



## హుస్నాబాద్ పట్టణంలో జి5 టౌన్‌షిప్ ఆధ్వర్యంలో మట్టి గణేశులు – మొక్కల పంపిణీ



హుస్నాబాద్ పట్టణంలో జి5 టౌన్‌షిప్ ఆధ్వర్యంలో పర్యావరణహిత వినాయక చవితి సందేశాన్ని ప్రజలకు అందిస్తూ, 1600 మట్టి గణేశ విగ్రహాలు మరియు పచ్చని మొక్కలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు పాల్గొన్నారు. పాల్గొన్నవారు మాట్లాడుతూ - "మట్టి గణేశ విగ్రహాల ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించవచ్చు, మొక్కల ద్వారా పచ్చదనం పెంపొందించవచ్చు" అని అభిప్రాయపడ్డారు. జి5 టౌన్‌షిప్ ప్రతినిధులు పేర్కొన్నారు:"ప్రకృతి - ప్రాణహితమే మా లక్ష్యం. ఈ వినాయక చవితి సందర్భంగా మట్టి గణేశ విగ్రహాలను ఇంటికి తీసుకెళ్ళి పూజించిన తర్వాత ఇంటి ప్రాంగణంలోనే నిమజ్జనం చేయాలి. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటాలి. ఈ విధంగా భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని అందించవచ్చు." ఈ కార్యక్రమం ఆగస్టు 27వ తేదీ మధ్యాహ్నం వరకు (వినాయక చవితి పర్వదినం) కొనసాగుతుంది. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి రేంజర్ సైకిల్, స్టీల్ వాటర్ బాటిల్లు అందజేస్తామని నిర్వాహకులు ఇలేని Sri , అజయ్, సంపత్ తెలిపారు.



## ఆత్మీయతను చాటుకున్న బాల్య మిత్రులు

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు 24 ప్రతినిధి**


సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామంలో విద్యాభ్యాసం పూర్తి చేసిన 1996 1997 పదవ తరగతి పూర్వ విద్యార్థులు తమ మిత్రుడు శ్రీ రేణుక మాత ఆలయ కమిటీ చైర్మన్గా ఎన్నికైన సందర్భంగా ఏల్పుల మహేష్ ను, భగవద్గీతలో శ్లోకాలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో అవార్డు పొందిన విజయలక్ష్మి ఇద్దరి మిత్రులకు సన్మానం చేసి ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనంలో కలిసిమెలిసి విద్యాభ్యాసం చేసిన మిత్రులకు ఇటువంటి అరుదైన గౌరవం దక్కడం వల్ల మాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని అందుకోసం గానే మా చిన్ననాటి మిత్రులను సన్మానం చేయడం జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మాతోపాటు ముందుకు వెళ్లే మిత్రులకు మా సహకారం ఎప్పుడూ ఉంటుందని తమ తోటి మిత్రులకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా ఇటువంటి సన్మానాలు ఎంతో దోహద పడుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందుల శ్రీనివాస్, రామ్ రెడ్డి, శ్రీశైలం, దయాకర్, శ్రవణ్, చక్రపాణి, రమేష్, రాజేశ్వరి, రాణి, పద్మ, సుస్మిత, సుశీల, రాజమణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారిని దర్శించుకున్న తెలంగాణ డెంటల్ డాక్టర్ అరవింద్ కుమార్

**దుబ్బాక సిద్దిపేట పవర్ ఆగస్టు 24 ప్రతినిధి**


సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామంలో ఉన్న శ్రీ రేణుక మాత ఆలయాన్ని దర్శించుకున్న తెలంగాణ డెంటల్ డాక్టర్ అరవింద్ కుమార్.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్ద గుండవెల్లి గ్రామం దుంపల పల్లి గ్రామానికి ఎంతో అవినాబావ సంబంధం ఉందని, అదే స్ఫూర్తితో అమ్మవారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అదేవిధంగా రాబోయే రోజుల్లో డెంటల్ సేవలను పేద ప్రజలకు మరింత ముందుకు తీసుక వెళ్ళడానికి కృషి చేస్తానని వారు తెలిపారు. అమ్మవారిని దర్శించుకున్న డెంటల్ డాక్టర్ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేసి అమ్మవారి చిత్రపటాన్ని బహుమానంగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ రేణుకా మాత ఆలయ కమిటీ చైర్మన్ ఏల్పుల మహేష్, దుంపలపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ ఇల్లెందుల శ్రీనివాస్ తో పాటు తమ పదవ తరగతి స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.



## గాంధీ మెడికల్ కాలేజీకి సురవరం డెడ్ బాడీ డొనేట్

**కడసారి వీడ్కోలు పలికిన నేతలు , కార్యకర్తలు**

**సికింద్రాబాద్, ఆగస్ట్ 24 ( సిద్దిపేట పవర్):** సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి పార్థివ దేహాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధనల నిమిత్తం సికింద్రాబాద్‌గాంధీ మెడికల్‌కళాశాలకు డొనేట్ చేశారు. ఆదివారం సాయంత్రం మఖ్దూంభవన్‌నుంచి గాంధీ మెడికల్‌కాలేజీ వరకు సురవరం భౌతికకాయాన్ని కార్యకర్తలు వెంట రాగా ఊరేగింపుగా తీసుకువచ్చారు. కుటుంబసభ్యులు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై కామ్రెడ్ లాల్‌సలామ్... అంటూ నినాదాలు చేస్తు ఆయనతో తమకున్న, జ్ఞాపకాలను,సన్నిహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు. ఈసందర్భంగా కళాకారులు గీతాలు ఆలపించారు.ఆయన కోరిక మేరకు భార్య విజయలక్ష్మీ, కుమారులు నిఖిల్,కపిల్ లతో కలిసి పలువురు సీపీఐ నేతలు సురవరం సుధాకర్‌రెడ్డి పార్థివ దేహాన్ని గాంధీ మెడికల్‌కాలేజీ ప్రిన్సిపాల్‌ప్రొఫెసర్‌ఇందిర, ఫిజియాలజీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్‌రమాదేవి, అనాటమీ ప్రొఫెసర్‌సుధాకర్‌బాబులకు అప్పగించారు. చాలా కాలం వరకు ఉండే విదంగా సురవరం భౌతిక కాయానికి ఎంబామింగ్ చేసి భద్రపరుస్తామని, వైద్యవిద్యార్థుల పరిశోధనలు, శరీర నిర్మాణం, సైంటిఫిక్‌నాలెడ్జ్ పెంచుకునేందుకు దోహదపడుతుందని వివరించారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా, రాజ్యసభ సభ్యులు బియన్‌విశ్వం, సంతోష్, కేరళ రాష్ట్ర మంత్రి రాజన్, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, మాజీ మంత్రులు హరీష్‌రావు, శ్రీనివాసగౌడ్, చెరుకు సుధాకర్, ప్రెస్‌అకాడమీ చైర్మన్‌శ్రీనివాసరెడ్డి తదితరులు హాజరై సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించి, కడసారి వీడ్కోలు పలికారు. సురవరం సుధాకర్ రెడ్డి పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థులు, సిబ్బంది అనాటమీ డిపార్ట్ మెంట్ కు తరలించారు.





# తిమ్మాపూర్ ని సందర్శించిన కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**

గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో జిల్లా కలెక్టర్ హైమావతి పర్యటించి, డెంగ్యూ జ్వరంతో మృతి చెందిన కొంతం మహేష్,నాయిని శ్రవణ్ కుమార్ కుటుంబాలను పరామర్శించారు. అదేవిధంగా గ్రామాన్ని కలియ తిరిగి జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహేష్ కుటుంబాన్ని ఫీవర్ ఉందని వెళ్తే మాకు లేదని చెప్పి గ్రామంలోని ఆర్ ఎంపీ వైద్యుడినీ సంప్రదిం చారన్నారు. గ్రామంలో ప్రతి ఇంట్లో నిల్వ ఉన్న నీటిని ఉండకుండా పారవేయాలని ఇంట్లో డబ్బాలు టైర్స్ ఉన్నా వాటిని అతి త్వరగా ఉండకుండా చేయాలనీ అన్నారు. ఫీవర్ ఎక్కువయ్యాక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారని కలెక్టర్ తెలిపారు. డెంగ్యూ వ్యాధి తీవ్రతతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి ఆవరణమును పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటినే త్రాగాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి ఇంట్లో దోమ తెరను వాడాలని, నీరు నిల్చిన చోట బ్లీచింగ్ పౌడర్ ను చల్లాలన్నారు. ప్రభుత్వమే కాదు, వ్యక్తి గతంగా ప్రతి ఒక్కరు శుభ్రంగా ఉండాలని చెప్పారు. ఎలాంటి జర్వం వచ్చిన ప్రజలకు తమ సహకారం ఉంటుందని అన్నారు. గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.వీరి తో పాటుగా డి ఎల్ పి ఓ వేదవతి డి యం హెచ్ ఓ ఎంపీడీఓ రామిరెడ్డి ఎం ఆర్ ఓ నిర్మల పంచాయతి సెక్రటరీ లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎవరి కోసం "నటన" రాజన్ యాత్ర..

**అధికారంలో ఉన్నారా..?**
**ప్రతి పక్షంలో ఉన్నారా?**

**సికింద్రాబాద్, ఆగస్టు 24 ( సిద్దిపేట పవర్):**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజాహిత యాత్ర పేరిట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ చేస్తున్న యాత్ర కేవలం నటన కోసం మాత్రమే అన్నట్లుగా ఉందని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నదా లేదా ప్రతిపక్షంలో ఉన్నదా అని తెలంగాణ ప్రజలు అయోమయంలో ఉన్నారని బీజేపీ రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి విమర్శించారు. మెట్టుగూడ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో మరియు దేశంలోని ఇరవై రాష్ట్రాల పైచిలుకు బీజేపీ అధికారంలో ఉంటే తెలంగాణ రాష్ట్రంలో కూడా బీజేపీ అధికారంలో ఉందనుకొని ఊహించి కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నట రాజన్ పాదయాత్ర చేస్తున్నారని ఎద్దేవాచేశారు.ప్రజాహిత యాత్ర అని కాకుండా ఆరు గ్యారంటీలు 420 హామీలతో అధికారంలో వచ్చి అమలు చేయనందుకు ప్రజలు క్షమించాలి అనే పేరుతో యాత్ర చేపడితే బాగుండేదని అన్నారు. మహిళకు తులం బంగారం నెల నెల 2500 వందలు అయిదు వందలకే సిలిండర్



అని మహిళలను మోసం చేసినందుకు మహిళల పక్షాన మీనాక్షి నటరాజన్ తెలంగాణ ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు.యాత్రలో కాంగ్రెస్ నాయకులు యూరియాను నల్ల బజార్ కు తరలిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తూకేంద్రాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. యూరియా కోసం,రెండు లక్షల రుణమాఫీ కోసం రైతులు కాంగ్రెస్ నాయకులను ప్రజాపాలన ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా అని కాంగ్రెస్ నాయకులను నిలదీస్తున్నారని అన్నారు.

## అభినవ్ నగర్ అధ్యక్షులుగా చంద్రపాల్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

**సికింద్రాబాద్, ఆగస్ట్ 24 ( సిద్దిపేట పవర్ ):**

పద్మారావు నగర్ అభినవ్ నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. బీజేపీ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త ఎన్.చంద్రపాల్ రెడ్డి ఏకగ్రీవంగా అసోసియేషన్ నూతన అద్యక్షుడిగా సభ్యులు ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శిగా నర్సింహారెడ్డి ఎన్నికయినట్లు సభ్యులు తెలిపారు. నూతన అద్యక్షుడిగా ఎంపికైన చంద్రపాల్ రెడ్డిని పలువురు అభినందించారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ఎప్పుడు ముందు ఉండి, పోరాడే ఆయన మరిన్ని పదవులు అదిరోహించాలని ఆకాంక్షించారు.



## స్కై ఫౌండేషన్ 283 వ అన్నదానం

**సికింద్రాబాద్, ఆగస్టు 24 ( సిద్దిపేట పవర్):**

హైదరాబాద్ నగరంలో రోడ్ల పక్కన ఫుట్ పాత్ ల మీద ఆకలితో అలమటిస్తూ జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులకు స్కై ఫౌండేషన్ నిర్వాహకులు తమ 283వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఫుట్ పాత్ పై ఉన్న వారికి ఫుడ్ ప్యాకెట్లను అందజేశారు. ప్రతి ఆదివారం తమ కోసం రకరకాల సేవ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని అనాథలు, నిరాశ్రయులు స్కై కి కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ పావని వాలంటీర్లు పాల్గొన్నారు



## సికింద్రాబాద్ లో సిక్కులు గురు గ్రంథ్ సాహిబ్ పేహ్లా ప్రకాశ్ పూరబ్

**సికింద్రాబాద్, ఆగస్ట్ 24 ( సిద్దిపేట పవర్) :**

హైదరాబాద్, సికింద్రాబాద్‌ల సిక్కు సమాజం ఆదివారం సికింద్రాబాద్ గురుద్వారా సాహెబ్‌లో శ్రీ గురు గ్రంథ్ సాహిబ్ పేహ్లా ప్రకాశ్ పూరబ్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంది. కార్యక్రమం ఆసా ది వార్ తో ప్రారంభమై, ప్రసిద్ధ రాగి జథా భాయ్ జగ్ప్రీత్ సింగ్ జీ ఖన్నా వాలే ఆధ్యాత్మిక కీర్తనలో భక్తులు పాల్గొన్నారు. వేడుకలకు పెద్ద సంఖ్యలో సిక్కు భక్తులు హాజరై, గురు కా లంగర్ లో పాల్గొన్నారు. సాయంత్రం ఈఎంఈ సెంటర్ గురుద్వారా, తిరుమల్ గిరిలో ప్రత్యేక సమాగమ్‌నిర్వహించారు .ఈ వేడుకలను గురుద్వారా సాహెబ్ సికింద్రాబాద్ ప్రభంధక కమిటీ ఆధ్వర్యంలో, జీఎస్సెస్ యువ సేవా దళం సహకారంతో నిర్వహించారు. సాంగత్, సేవాదారుల సమిష్టి కృషితో వేడుకలు అత్యంత క్రమశిక్షణ, భక్తి, సేవా భావాలతో విజయవంతంగా జరిగాయి. ప్రెసిడెంట్ బల్దేవ్ సింగ్ బగ్గా, జనరల్ సెక్రటరీ జగ్మోహన్ సింగ్, వైస్ ప్రెసిడెంట్ సురీందర్ పాల్ సింగ్, హర్ప్రీత్ సింగ్ గులాటి, తారన్ దీప్ సింగ్ బాటియా పాల్గొన్నారు.



## టిప్పర్లకు అధికారులు వెంటనే పరిమిషన్లు కల్పించాలి.

**టిప్పర్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె..**

**సిద్దిపేట ఆగస్ట్23**

సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, మైనింగ్ శాఖ వాళ్ళు, రెవెన్యూ శాఖ అధికారులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని టిప్పర్స్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా కేంద్రంలో టిప్పర్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టిప్పర్లు నిలిపివేసి నిరవదిక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గత రెండు మూడు నెలలుగా అధికారుల వేధింపులు తాళలేక టిప్పర్లు నడిపే పరిస్థితిలో లేమని రోజు టిప్పలు నడిపితే కానీ మా జీవనం గడిచే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబ సభ్యుల బ్రతుకులు దుర్భరమైపోయాయన్నారు.. అలాగే టిప్పర్లపై ఫైనాన్స్ చేపించి ప్రతినెల ఇన్స్టాల్మెంట్లు కట్టలేక పోతున్నామన్నారు.. అధికారులు ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించి ప్రభుత్వ నిబంధన ప్రకారం తమకు పర్మిషన్లు ఇవ్వాలని అధికారులను ప్రభుతాన్ని వేడుకుంటున్నన్నారు..ఈ కార్యక్రమంలో అసోయేషన్ అధ్యక్షుడు బోదాస్ మల్లేశం, ఉపాధ్యక్షుడు ఈర్ల రంగం సభ్యులు సంపత్, ప్రశాంత్, రాజు,శ్రీను, శ్యామ్, మల్లేశం, అసోయేషన్ సభ్యులు పాల్గొన్నారు..




## ప్రజాసేవతోనే నాయకులకు గుర్తింపు...

**ఘనంగా మర్రి శశిధర్ రెడ్డి జన్మదిన వేడుకలు**

**సికింద్రాబాద్, ఆగస్ట్ 24 ( సిద్దిపేట పవర్):** మాజీమంత్రి, రాష్ట్ర బీజేపీ నాయకులు మర్రి శశిధర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. బేగంపేట లోని బీజేపీ కార్యాలయంలో జరిగిన వేడుకలకు రాష్ట బీజేపీ అద్యక్షులు ఎన్,రామచంద్రరావు, రాజ్యసభ సభ్యులు డా.కే.లక్ష్మన్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హజరయ్యారు. ఈసందర్భంగా భారీ కేకు కట్ చేశారు. మర్రి శశిధర్ రెడ్డికి నాయకులు, కార్యకర్తలు బర్త్ డే విషేస్ చెప్పారు. కార్యక్రమంలో రాష్ట బీజేపీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, మర్రి పురూరవరెడ్డి, సనత్ నగర్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు





# కొత్త వైరస్ కలకలం.. ఏమిటీ వైరస్.. ఎలా వ్యాపిస్తుంది?

**మరోసారి చైనాలో కొత్త వైరస్ కలకలం రేపుతోంది. ఆ దేశంలో చాలా మంది ఆస్పత్రి పాలవుతున్నట్టు వార్తలు గుప్పుమంటున్నాయి. అసలు ఈ వైరస్ సంగతేంటి? ఎలా వ్యాపిస్తుంది? దీని కథాకమామిషు ఏమిటి? ఈ కథనంలో తెలుసుకుందాం..**



గతంలో చైనాలో పుట్టిన వైరస్ మొత్తం ప్రపంచాన్నే వణికించిన విషయం తెలిసిందే. తాజాగా అటువంటి వైరస్ వ్యాపించిందంటూ మరోసారి వార్తలు వినిపిస్తున్నాయి. అయితే తాజాగా ఏదో గుర్తు తెలియని వ్యాధితో చైనాకు చెందిన పలువురు ప్రజలు వ్యాధి బారిన పడుతున్నట్టు తెలుస్తోంది. దీంతో ప్రపంచదేశాలన్నీ మరోసారి వణికిపోతున్నాయి. ఈ వైరస్ ఇండియాలోకి కూడా అడుగుపెట్టబోతున్నదా? ప్రపంచదేశాలను కుదిపేయబోతున్నదా? అన్న డౌట్స్ వస్తున్నాయి.

### కొత్త వైరస్ లక్షణాలు ఏమిటి?

కొత్తగా వైరస్ సోకిన వ్యక్తులకు ముఖ్యంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలు వస్తున్నట్టు తెలుస్తోంది. ఊపిరి పీల్చుకోవడం ఇబ్బందులతో పాటు ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు వస్తున్నాయట. ఈ కొత్త వైరస్ లక్షణాలు సైతం కరోనా మాదిరిగానే ఉండడంతో ప్రజలంతా భయపడుతున్నారు. ముప్పు ఎటువైపు నుంచి మళ్ళీ దాపురిస్తుందోనని కంగారు పడుతున్నారు. కరోనా మ్యుటేట్ చెంది మళ్ళీ ప్రమాదకరంగా మారి ప్రజలపై దాడి చేస్తుందా అనే భయాందోళనలో ప్రజలు బతుకుతున్నారు.

### భారతీయుల్లో భయం.. భయం

చైనాలో కొత్తగా విస్తరిస్తున్న వైరస్ కారణంగా భారతీయులు కూడా చాలా భయాందోళనలు చెందుతున్నారు. ఇది ఎక్కడ మన దేశంలో ప్రవేశిస్తుందోనని కంగారు పడుతున్నారు. అయితే ఈ వైరస్ మన ఇండియాలోకి వచ్చేందుకు కూడా అవకాశాలు లేకపోలేదు. ఇటీవల చైనాతో మన దేశానికి ఉన్న తగాదాలు తగ్గిపోవడంతో పాటు ఇరు దేశాల బోర్డర్లు ఓపెన్ కావడంతో ఇది సులభంగా మన దేశంలోకి ప్రవేశిస్తుంది నిపుణులు అంచనా వేస్తున్నారు. పైగా చైనా నుంచి టూరిస్టులు కూడా ఇటీవల మన దేశానికి ఎక్కువగా వస్తున్నారని, దాని కారణంగా ఈ వైరస్ ఇండియాలోకి వచ్చే అవకాశం ఉందంటున్నారు.

దీంతో పాటు మన దేశానికి చెందిన చాలా మంది ఇటీవల కాలంలో టూర్స్ కోసమని ఇతర దేశాలకు ఎక్కువగా వెళ్తున్నారు. దీని కారణంగా వారికి కూడా వ్యాధి సోకె అవకాశం ఉంది. ఇప్పటికైతే ఆ వ్యాధి ఒకరి నుంచి ఇంకొకరికి సోకుతుందా లేదా అనే క్లారిటీ లేనప్పటికీ, కరోనా లక్షణాలు ఉన్నాయి కాబట్టి ఆ వ్యాధి కూడా ఒకరి నుంచి మరొకరికి సోకె అవకాశం ఉందని తెలుస్తోంది. ఒకవేళ ఒకరి నుంచి ఒకరికి సోకితే టూరిజం, వ్యాపారం, ఇతర మార్గాల ద్వారా అది మన దేశంలో కూడా ప్రవేశించే అవకాశం ఉంది.

### నివారణ మార్గాలు

మన దేశంలో ప్రమాదంలో పాదకుముందే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకవేళ వైరస్ సోకినట్లు తెలిస్తే విమాన సర్వీసులను రద్దు చేయాలి. సోకిన వ్యక్తికి పరీక్షలు జరిపి ఇతరులకు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముందస్తుగా స్పందిస్తూ.. ప్రతి ఒక్కరినీ అప్రమత్తం చేయాలి. ప్రమాద తీవ్రత ఎక్కువ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పుడే ఇలాంటి పెనుముప్పుల నుంచి దేశంతో పాటు దేశంలోని ప్రజలను కూడా కాపాడుకోవచ్చు.




# మహారాష్ట్ర స్పెషల్ రెసిపీ

## తేచ్చా పచ్చడి.. ఇలా తయారు చేసుకుందాం..!

మహారాష్ట్ర ప్రజలు ఎంతో ఇష్టంగా తినే రెసిపీల్లో తేచ్చా పచ్చడి కూడా ఒకటి. తేచ్చా పచ్చడి ప్రధానంగా పచ్చి మిర్చీలు ఉపయోగించి తయారు చేస్తారు. అసలు ఈ పచ్చడి ఎలా తయారుచేసుకోవాలి. దీనికి కావాల్సిన పదార్థాలు ఏమిటి? ఈ పచ్చడి స్పెషాలిటీ ఏమిటి? అనేది ఈ కథనంలో తెలుసుకుందాం. తేచ్చా పచ్చడిని వేడి వేడి అన్నంతో లేదా రోటీలు లేదా చపాతీలతో కలిపి తింటే అద్భుతంగా ఉంటుంది. మరాఠీలకు ఈ పచ్చడి ఎంతో ప్రీతిపాత్రమైనది. ఈ పచ్చడిని సింపుల్ గా ఇంట్లో ఎలా తయారుచేసుకోవాలో చూద్దాం.

### కావాల్సిన పదార్థాలు

బజ్జీ మిర్చి
పల్లీలు
జీలకర్ర
వెల్లుల్లి
నూనె
ఉప్పు




### తేచ్చా తయారీ విధానం

ముందుగా స్టవ్ మీద పెనం పెట్టి దానిమీద 8 బజ్జీ మిర్చిలను తొడిమలు తీసి ఒక్కో మిర్చిని రెండు మూడు ముక్కలుగా చేసి పెనంమీద వేసి మిర్చిపై నల్లని మచ్చలు ఏర్పడేంతరవకు కలుపుతూ వేపుకోండి. మిరపకాయ ముక్కలమీద నల్లగా మచ్చలుగా రావడం ప్రారంభమైనప్పుడు వాటిమీద ఒకటిన్నర టేబుల్ స్పూన్ నూనె, పావు కప్పు వేరుశెనగ పప్పు, పొట్టు తీసిన 2025 వెల్లుల్లి రెబ్బలు, 1 టీస్పూన్ జీలకర్ర వేసి మంటను సిమ్ లో పెట్టి కలుపుతూ వేయించుకోండి. పల్లీలు వేగుతున్న సమయంలోనే వాటిపై తగినంత ఉప్పు చల్లుకోండి. పల్లీలు అన్నీ బాగా వేగిన తర్వాత కొంచెం కొత్తిమీర తరుగు అందులో వేసి స్టవ్ ఆఫ్ చేసేయండి. ఇప్పుడు ఈ మొత్తాన్ని మిక్సీలో లేదా రోట్లో వేసి కచ్చాపచ్చాగా దంచుకోండి. రోట్లో వేసి దంచితేనే అసలు సిసలైన తేచ్చా టేస్ట్ వస్తుంది. ఈ తేచ్చాని వేడి అన్నంలో లేదా రోటీ,చపాతీల్లో కలిపి తింటే యమా రుచిగా ఉంటుంది.



# చలికాలంలో పెదవులు పగులుతున్నాయా? ఈ చిట్కాలు పాటించండి



వింటర్ సీజన్ లో చర్మం పొడిబారడటం వెరీ కామన్. ముఖ్యంగా పెదవులు కూడా పగులుతూఉంటాయి. అయితే అసలు ఈ సమస్య నుంచి ఎలా బయటపడాలి. పెదవులు పగలకుండా ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి. అన్న విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం.. శీతాకాలంలో గాలిలో తేమ తక్కువగా ఉండడం వల్ల చర్మం, ముఖ్యంగా పెదవుల చర్మం పొడిబారడం ఇంకా పగుళ్లు ఏర్పడటం మొదలవుతుంది. ఈ సమస్యను నివారించడానికి అనేక గృహ, ఆయుర్వేద నివారణలు అందుబాటులో

### వాటర్ ఎక్కువగా తీసుకోవాలి

పగటిపూట తగినంత నీరు తాగాలి. దీంతో శరీరం మొత్తం తేమను కాపాడుతుంది. దాంతో పెదవుల పగుళ్ల సమస్యను కొంతమేర తగ్గిస్తుంది. నెయ్యి, వెన్న రెండూ చర్మానికి చాలా పోషకమైనవి. చలికాలంలో రాత్రి పడుకునే ముందు పెదవులపై నెయ్యి లేదా వెన్న రాసుకోవాలి. ఇది సహజమైన మాయిశ్చరైజర్గా పనిచేసి పెదవులకు తేమను అందిస్తుంది.



### తేనె..

తేనె సహజ హైడ్రేటింగ్ ఏజెంట్. ఇంకా యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు కూడా పుష్కలంగా ఉంటాయి. తేనెను నేరుగా పెదవులపై అప్లై చేసి కొద్దిసేపటి తర్వాత కడిగేయాలి. ఇది పెదాలను మృదువుగా ఇంకా ఆరోగ్యంగా ఉంచుతుంది.



### కొబ్బరి నూనె



కొబ్బరి నూనెలో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి పొడి, పగిలిన పెదాలను నయం చేయడంలో సహాయపడతాయి. శీతాకాలంలో కొబ్బరి నూనెను రోజుకు చాలా సార్లు ఉపయోగించవచ్చు.

మృదువుగా మార్చడంలో ఇది సహాయపడుతుంది.

### నువ్వుల నూనె

నువ్వుల నూనెను ఆయుర్వేదంలో చాలా ఉపయోగకరంగా భావిస్తారు. ఇది పెదాలకు లోతైన తేమను ఇస్తుంది. ఇది పగిలిన చర్మాన్ని నయం చేస్తుంది. చలికాలంలో క్రమం తప్పకుండా నువ్వుల నూనెను పెదవులపై అప్లై చేయడం వల్ల పెదాలు పొడిబారడం, పగిలిపోవడం వంటివి నివారించవచ్చు.



### ఆల్మండ్ ఆయిల్

ఆల్మండ్ ఆయిల్లో విటమిన్ ఈ, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి పెదాలను మృదువుగా చేస్తాయి. ఇవి చల్లని వాతావరణం నుండి కాపాడతాయి. రాత్రి పడుకునే ముందు బాదం నూనె అవసరమైన చోట రాయండి.



### అలోవెరా జెల్:

పెదవుల వాపు, చికాకును తగ్గించడానికి అలోవెరా జెల్ ఉపయోగించవచ్చు. ఇందులో ఉండే కూలింగ్ గుణాలు పెదవులకు ఉపశమనం కలిగించి, పగిలిపోకుండా చేస్తుంది.

### రోజ్ వాటర్:

రోజ్ వాటర్ చర్మానికి చల్లదనాన్ని, తేమను అందిస్తుంది. దీన్ని కాటన్ బాల్తో పెదవులపై అప్లై చేయడం వల్ల పెదాలు హైడ్రేట్గా ఉంటాయి. ఇంకా వాటిపై వాపు కూడా తగ్గుతుంది.

### వేప నూనె:

వేప నూనె యాంటీ బాక్టీరియల్ ఇంకా యాంటీ ఫంగల్, ఇది పగిలిన పెదవులలో సంక్రమణ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. పెదాలను మళ్లీ ఆరోగ్యంగా ఇంకా

